క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 23న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. కాశిబుగ్గ నుంచి పోచమ్మమైదాన్ రోడ్డు, చార్‌బౌలి, నిజాంపుర, మండి బజార్, ఎల్‌బీ నగర్, జీఆర్ గుట్ట, లక్ష్మీపూర్, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే, హనుమకొండలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. లష్కర్ బజార్ మెయిన్ రోడ్డు, లష్కర్ బజార్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, వెస్ట్ సిటీ సబ్‌స్టేషన్ ప్రాంతంలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, మచిలీబజార్ సబ్ స్టేషన్ ప్రాంతంలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు చిత్రకళా పోటీలు

హన్మకొండ చౌరస్తా: ఈనెల 24వ తేదీన హనుమకొండలోని తనిష్క్ జ్యువెల్లరీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో చిత్రకళా పోటీలు నిర్వహించనున్నట్లు సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ సాగంటి మంజుల శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. భారత స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా డ్రీమ్ ఇండియా అనే అంశంపై డ్రాయింగ్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. వివరాల కోసం 81436 43337 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సుమతిరెడ్డి కళాశాలకు డ్రగ్ ఫ్రీ క్యాంపస్ అవార్డు



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలకు డ్రగ్ ఫ్రీ క్యాంపస్ అవార్డు దక్కింది. ఈ మేరకు ఇటీవల జరిగిన కార్యక్రమంలో కళాశాలకు చెందిన డాక్టర్ సుదర్శన్, డాక్టర్ ప్రశాంత్‌కు అవార్డుతోపాటు సర్టిఫికెట్‌ను టీజీఎఎస్ డైరెక్టర్ సందీప్ శండిల్యా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు.

ప్రభుత్వ స్థలాల హద్దుల పరిశీలన

హన్మకొండ అర్బన్: ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హనుమకొండ తహసీల్దార్ గుజ్జ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. శ్రీనివాస కాలనీలో పాటు పలు ప్రాంతాల్లోని ప్రభుత్వ స్థలాలను శుక్రవారం సందర్శించి హద్దులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమకొండ పరిధిలోని ప్రభుత్వ స్థలాలను కొంతమంది అక్రమంగా కబ్జా చేస్తూ గుడిసెలు వేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ఇకపై ఎవరైనా కబ్జాలకు పాల్పడితే సహించేది లేదని క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు.

బీజేపీ నేతల గృహ నిర్బంధం



హన్మకొండ: సేవ్ హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా సచివాలయం ముట్టడికి బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆ పార్టీ నాయకులు హైదరాబాద్‌కు తరలివెళ్లకుండా పోలీసులు గృహ నిర్బంధం చేశారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని స్వగృహంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నయీంనగర్‌లోని గృహంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డితో పాటు, ఇతర నేతలను వారివారి గృహాల్లో శుక్రవారం గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ నాయకులను అక్రమంగా గృహ నిర్బంధం చేయడం దుర్మార్గమైన చర్య అని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ దురహంకారానికి, దౌర్జన్యానికి ఉదాహరణ అని తూర్పారబట్టారు.

కుల, మత, ప్రాంతీయ బేధాలు రెచ్చగొడితే చర్యలు తప్పవు

రామన్నపేట: కుల, మత, ప్రాంతీయ బేధాలు రెచ్చగొడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ హెచ్చరించారు. ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ పిలుపు మేరకు మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డాల్ఫిన్ వీధిలో సెల్‌ఫోన్ రిపేరింగ్ షాపుల నడుపుకుంటూ జీవిస్తున్న స్థానికులకు వ్యతిరేకంగా మార్వాడీస్ గో బ్యాక్ అనే నినాదంతో శుక్రవారం ప్రదర్శన చేసిన నిరసనకారులను ముందస్తుగా అరెస్టు చేసి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ మార్వాడీలు, ఇతర ప్రాంతీయ మైనార్టీ సమూహాల భద్రతకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. 50 మంది సిబ్బందితో శాంతిభద్రతలపై భరోసా కల్పించేందుకు ఎస్‌పీఎస్ రోడ్డు, పాపయ్యపేట చమాన్, బట్టల బజార్, డాల్ఫిన్ గల్లీ, జేపీఎన్ రోడ్డు, దుర్గేశ్వరస్వామి టెంపుల్ వీధి, పోచమ్మమైదాన్, ఎంజీఎం జంక్షన్ సర్కిల్ మీదుగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు సీఐ వివరించారు.

ఎరువుల అధిక వినియోగంతో అనర్థాలు

ఖిలా వరంగల్: వరంగల్, హనుమకొండ జిల్లాల్లో ఎక్కువ మంది రైతులు యూరియా కోసం బారులుదీరుతున్నారు. కొందరు అవసరం మేరకు వాడుతుండగా.. మరికొందరు అధిక దిగుబడులకు ఆశపడి ఎక్కువ మొత్తంలో రసాయన ఎరువులు వినియోగిస్తుండడంతో నేల తన సారాన్ని కోల్పోతోంది. ఇలా పండించిన ఆహారం తినడంతో మనుషుల్లో అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. ఇవి పర్యావరణంపై కూడా తీవ్ర ప్రభావాన్ని చూపడంతో నేల, గాలి, నీరు కలుషితమవుతున్నాయి. సేంద్రియ ఎరువుల వినియోగంతో దిగుబడులు తక్కువగా ఉన్నా నేల ఆరోగ్యవంతంగా ఉంటుంది. ఈ విధానాన్ని ప్రోత్సహించడానికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నా చాలామందిలో మార్పు రావట్లేదు. భావితరాలు కష్టాలు పడకుండా ఉండాలంటే రైతులు కృత్రిమ ఎరువుల వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉంది.

ఇలా చేస్తే మంచిది..

సాధారణ నేలలో అయితే నత్రజని(ఎన్), భాస్వరం (పి), పొటాషియం(కె)లను 4.2.1 నిష్పత్తిలో వినియోగించాలి. ఎకరాకు సుమారు రెండున్నర బ్యాగుల యూరియా, ఒక బ్యాగు డీఏపీ, ఒకటిన్నర బ్యాగు కాంప్లెక్స్ వాడాలి. అయితే, రైతులు 5 నుంచి 6 బస్తాల వరకు వినియోగిస్తున్నారు. ఈ ఏడాది వానాకాలంలో చాలా మంది వరి నాట్లు వేసే సమయంలో ఎకరానికి కాంప్లెక్స్‌తోపాటు నత్రజని ఒక బస్తా చొప్పున వాడుకున్నారు. దాని వల్ల ఎలాంటి ఫలితం ఉండదు. పంట కాలంలో రెండు బస్తాల యూరియా (100 కిలోలు) మూడు దఫాలుగా చల్లుకోవాలి. నాటు వేసిన 20 రోజుల తర్వాత 33 కిలోలు, కలుపు అనంతరం 33కిలోలు, పొట్ట దశలో 34 కిలోలు వేయాలి. ఇలా చేస్తేనే పైరుకు సరిపడా నత్రజని అంది మంచి దిగుబడి వస్తుంది. భూసారం కూడా దెబ్బతినదు.



పీఏసీఎస్ గోదాంలో యూరియా నిల్వలు (ఫైల్)

సేంద్రియ వ్యవసాయం చేయాలి



వరి పైరుకు అధిక మోతాదులో నత్రజని వాడడంతో ఏపుగా పెరుగుతుంది. కానీ, భూసారం దెబ్బతింటుంది. పైర్లు బాగా పెరిగి నేల వాలడంతో పంట దిగుబడి తగ్గి, పంటకు పలు రకాల వ్యాధులు సోకుతాయి. దానివల్ల మళ్లీ రసాయనాలు పిచికారీ చేయాల్సి వస్తుంది. ఇలా చేస్తూపోతే అనేక ఆర్థిక నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలి.

- అనురాధ,
జిల్లా వ్యవసాయాధికారి, వరంగల్



యూరియా కోసం బారులుదీరిన రైతులు

రైతుకు తప్పని తిప్పలు

యూరియా కోసం రైతులకు తిప్పలు తప్పడం లేదు. హసన్‌పర్తి మండలంలోని పలు సొసైటీలకు గురువారం రాత్రి యూరియా సరఫరా చేశారు. అయితే, శుక్రవారం ఉదయం 7గంటల నుంచి సొసైటీల్లో యూరియా విక్రయాలు ప్రారంభించారు. హసన్‌పర్తి, ముచ్చర్లతో పాటు వంగపహాడ్‌లోని వ్యవసాయ సహకార సంఘాల్లో యూరియా అమ్మకాలు చేపట్టారు. ఈ క్రమంలో యూరియా కోసం రైతులు బారులుదీరారు.

- హసన్‌పర్తి



యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

హన్మకొండ: ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆదుకుంటామని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి పల్లెపాడు దామోదర్ అన్నారు. హనుమకొండ రాంనగర్‌లో సర్వోదయ సంస్థ ఆధ్వర్యంలో వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఆత్మకూరు, గీసుకొండ మండలాల్లోని 70 మంది మహిళలకు రూ.25 వేల చొప్పున వడ్డీ లేని రుణాలను చెక్కుల రూపంలో అందించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు 25 ఏళ్లుగా సంస్థ తరఫున ఆర్థిక సాయం చేస్తూ వడ్డీ లేని రుణాలను అందజేసి అండగా నిలుస్తున్నట్లు చెప్పారు. 3,700 మంది మహిళలకు సర్వోదయ సంస్థ రుణాలు ఇచ్చి ఆదుకుందని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సర్వోదయ సంస్థ ప్రతినిధులు కవిరాజ్, ఇందిర, రవీందర్ సతీష్, జ్యోత్స్న, మంజుల, రాజు పాల్గొన్నారు.



మహిళలకు చెక్కులు అందిస్తున్న దామోదర్

బాధ్యతల స్వీకరణ



కమిషనర్‌కు మొక్క అందజేస్తున్న డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య



మేయర్‌కు పూలమొక్క అందజేస్తున్న అదనపు కమిషనర్ చంద్రశేఖర్

రామన్నపేట: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా సమ్మయ్య, అదనపు కమిషనర్‌గా చంద్రశేఖర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారు వేర్వేరుగా మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా వారికి మేయర్, కమిషనర్ శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్మీలో పనిచేయడానికి ఎన్‌సీసీ దోహదం



ఎంపిక పరీక్షలు నిర్వహిస్తున్న ఎన్‌సీసీ అధికారులు

రామన్నపేట: ఆర్మీలో పనిచేయడానికి ఎన్‌సీసీ శిక్షణ కేడెట్లకు ఎంతో దోహదపడుతుందని ఎల్‌బీ కళాశాల ప్రిన్సిపాల్ అరుణ డీహెచ్‌రావు అన్నారు. కళాశాలలోని ఎన్‌సీసీ ఆర్మీ పదో బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ ప్రవేశాలకు శుక్రవారం ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్‌సీసీ బీ, సీ సర్టిఫికెట్లు పొందితే నేరుగా ఆర్మీలో ప్రవేశం పొందవచ్చని వివరించారు. దేశ సేవ చేయడానికి కేంద్ర పారా మిలిటరీ, ఉద్యోగాలు పొందడానికి ప్రత్యేక రిజర్వేషన్ వర్తిస్తుందని తెలిపారు. విద్యార్థుల ఎత్తు, బరువు, రన్నింగ్, సెటప్‌లు, పుష్‌అప్‌లు, మెడికల్ వైద్య పరీక్ష, రాత పరీక్షలు నిర్వహించి ఎంపిక ప్రక్రియ నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో కల్నల్ ఎస్ఎస్.రామదురై, సదానందం, సంతోషం రౌత్, కుమారస్వామి, అలీ, కేడెట్లు మోహన్, శివప్రసాద్, రిషిత్‌నంద, సాయి, గణేష్, వెన్నెల, శివాణి, సాహిత్య, తదితరులు పాల్గొన్నారు.

కొత్వాల్ రాజా బహదూర్ జయంతి



హసన్‌పర్తి: కేక్ కట్ చేస్తున్న సంఘం సభ్యులు

హన్మకొండ అర్బన్: హైదరాబాద్ రెడ్డి హాస్టల్ వ్యవస్థాపకుడు, కొత్వాల్ రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి 156వ జయంతి వేడుకలను నగరంలోని పోస్టల్ కాలనీలోని సంఘం కార్యాలయంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో అర్జుల కిషన్ రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ మేరకు రాజా బహదూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నివాళులర్పించారు. తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్ రెడ్డి, నాయకులు చందుపట్ల నరసింహారెడ్డి, నల్ల రాజిరెడ్డి, మట్ట రాజశేఖర్ రెడ్డి, చాడా జైహింద్ రెడ్డి, కుందూరు ప్రకాశ్ రెడ్డి, ఏదుల మెట్రో రెడ్డి, నంద్యాల కిషన్ రెడ్డి, బండి నరసింహారెడ్డి, గణపతి రెడ్డి పాల్గొన్నారు.

హసన్‌పర్తి: కొత్వాల్ రాజా బహదూర్ వెంకట్రామ్ రెడ్డి జయంతిని ఒకటో డివిజన్ ముచ్చర్లలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెడ్డి సంఘం అధ్యక్షుడు ఇంద్రాసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, సభ్యులు హరిప్రసాద్, కుమార్ రెడ్డి, గణపతిరెడ్డి, రవీందర్‌రెడ్డి, ఇంద్రన్న సుధాకర్ రెడ్డి, సాంబశివారెడ్డి, దేవాల్‌రెడ్డి, విలాకర్‌రెడ్డి, మాధవరెడ్డి, ధర్మారెడ్డి, ఇంద్రయ్య పాల్గొన్నారు.

లారీలను పంపించారు



లారీలు ఖాళీ చేసిన స్థలం

సాక్షి స్పందన

హసన్‌పర్తి: ఎస్సారెస్పీ భూముల్లో పార్కింగ్ చేసిన లారీలను బయటికి పంపించారు. 'కబ్జా చేశాడు.. అద్దెకు ఇచ్చాడు'. అనే కథనం 'సాక్షి'లో ఇటీవల ప్రచురితమైంది. ఈ మేరకు నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో ఆపరేషన్ నిర్వహించారు. ఈ క్రమంలో లారీలను బయటికి తీసుకెళ్లడానికి యజమానులు అంగీకరించలేదు. చివరికి ఇసుక లారీలను బయటికి పంపించి భూమి చుట్టూ జేసీబీతో కందకం తీశారు. కార్యక్రమంలో డీఈఈ రాజు, ఏఈ శ్రీనివాస్, ఆర్ఐ ఫాజిల్, ఎస్సై రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు వేతనాలు చెల్లించాలి

హన్మకొండ: కాకతీయ మెడికల్ కళాశాలలోని మెన్స్, ఉమెన్స్ హాస్టళ్లలో పనిచేస్తున్న కార్మికులకు 8 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, వెంటనే వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు. ఈ మేరకు మంత్రి కొండా సురేఖను హనుమకొండ రాంనగర్‌లోని స్వగృహంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జిల్లపెల్లి సుధాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం కలిసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, హాస్టల్ వర్కర్లు అల్లం రమేష్, రాణి రాజకుమారి, ఎండీ.అతిక్, బిట్ల రాము, మంద కవిత, రవి, బాబు, శశి, ప్రశాంత్, సునీత, శ్రీను పాల్గొన్నారు.



మంత్రికి సమస్యలు వివరిస్తున్న నాయకులు

వ్యాపారుడి కుమారుడి చికిత్సకు ఆర్థిక చేయూత

న్యూశాయంపేట: వరంగల్ లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్‌లోని వ్యాపారి ఎండి.సర్వర్ పెద్ద కుమారుడు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ మేరకు చికిత్స నిమిత్తం వరంగల్ జిల్లా హోల్‌సేల్ అండ్ రిటైల్ కూరగాయల మార్కెట్ కమిటీ సభ్యులు రూ.లక్ష 40వేలను అధ్యక్షుడు బిట్ల కృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ చింతాకుల సునీల్‌కుమార్ మాట్లాడుతూ వ్యాపారస్తులు కలిసి తన తోటి వ్యాపారి కుటుంబాన్ని ఆదుకోవడం అభినందించారు. స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్, మార్కెట్ సూపర్‌వైజర్ మురళి, కమిటీ బాధ్యులు సామల రాజు, అలీ, భాస్కర్, సూరయ్య, బలరాం, మంద రంజిత్, మహేష్, కోమటి రాజు, శ్రీను, క్రాంతి, రహీం, రాజేష్, గోపాల్, శివన్న, రమేష్, శ్రీను, శేఖర్, సూరి, శ్రీకాంత్, అనిల్, కార్తీక్, సురేష్, పాపని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



నగదు అందజేస్తున్న సంఘం నాయకులు

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ రమేష్

ఖిలా వరంగల్: గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మిల్స్ కాలనీ ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ సూచించారు. ఈ మేరకు డీజే సౌండ్స్, మండప నిర్వాహకులతో ఎస్సైలు శ్రావణ్, మహేష్, రమేష్ ఆధ్వర్యంలో వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా, స్నేహపూర్వక వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని చెప్పారు. మండపాల ఏర్పాటు, డీజే సౌండ్స్, నిమజ్జనం తదితర కార్యక్రమాలకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకొని అనుమతులు పొందాలని ఆయన సూచించారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి



ధర్నాలో పాల్గొన్న రేషన్ డీలర్లు

హన్మకొండ అర్బన్: ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా రేషన్ డీలర్ల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్‌బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో సంఘం నాయకులతో కలిసి శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ డీలర్లకు కనీస గౌరవ వేతనం రూ.5 వేలు ఇచ్చి కమీషన్ రూ.300 పెంచాలని, ఏ నెల కమీషన్ ఆ నెలలోనే చెల్లించాలని కోరారు. రేషన్ షాపులను మినీ సూపర్ మార్కెట్లుగా గుర్తించి నిత్యావసర సరుకులు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డిమల్ల హనుమండ్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, కోశాధికారి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, శ్రీనివాస్, రవీందర్, వెంకటేష్, రాము, మోహన్, నాయకులు నర్సయ్య, భానుచందర్, దామోదర్, వెంకటనారాయణ, పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

గణితాన్ని సులభరీతిలో బోధించాలి

విద్యారణ్యపురి: గణితాన్ని సులభరీతిలో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రం శ్రీనివాస్ అన్నారు. లాజికల్ అండ్ మ్యాజికల్ మెథడ్స్ బై యూజింగ్ వేదిక్ మ్యాథ్‌మెటిక్స్ అనే అంశంపై శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య వక్తలుగా అధ్యాపకులు డాక్టర్ అడ్లూరి నర్సింహామూర్తి, నన్నపరాజు పరమేశ్వర్ రాజు మాట్లాడుతూ గణితశాస్త్రంలో సమస్యల పరిష్కారానికి సులభమైన పద్ధతలను వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, అధ్యాపకులు శ్రీనాథ్, శివనాగ శ్రీను, రవికుమార్, సత్యనారాయణ, వెంకన్న, నరహరి, మంగమ్మ, బండి వేణు తదితరులు పాల్గొన్నారు.

వాగ్దేవి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

హన్మకొండ: డిగ్రీ పాస్ అయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా మూడేళ్ల ఫీజులు చెల్లించాలని వేధిస్తున్న వాగ్దేవి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ కళాశాల ఎదుట విద్యార్థులతో కలిసి శుక్రవారం ఆందోళన చేశారు. ఏబీఎస్ఎఫ్ నాయకులు విజయ్, కిరణ్, రాహుల్, సాయి, వెంకటేష్, బన్నీ పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కులను కాపాడుకుందాం

కేయూ క్యాంపస్: ఆదివాసీల హక్కులను కాపాడుకుందామని డీఎస్‌ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్ అన్నారు. ఈ నెల 24న హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సంబంధిత వాల్‌పోస్టర్లను కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద శుక్రవారం ఆవిష్కరించారు.

జస్టిస్ లక్ష్మణ్‌ను కలిసిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు

వరంగల్ లీగల్: ఇటీవల నియమితులైన వరంగల్, హనుమకొండ ఉభయ జిల్లాల పరిపాలన న్యాయమూర్తి, హైకోర్టు జడ్జి జస్టిస్ కె.లక్ష్మణ్‌ను హైదరాబాద్‌లో ఉభయ జిల్లాల బార్ అసోసియేషన్ ప్రతినిధులు వలుస సుధీర్, పులి సత్యనారాయణ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు.

వీసీ ప్రతాప్‌రెడ్డికి శుభాకాంక్షలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో వీసీ ప్రతాప్‌రెడ్డిని పార్ట్‌టైం అధ్యాపకుల అసోసియేషన్ బాధ్యులు శుక్రవారం కలిశారు. ఈ నెల 19, 20, 21వ తేదీల్లో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌ను విజయవంతంగా నిర్వహించినందుకు వీసీకి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్ట్‌టైం అధ్యాపకుల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నాగేశ్వర్ రావు, బాధ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి

వరంగల్ క్రైం: తమకు అప్పగించిన పనులను పోలీస్ అధికారులు సమర్థవంతంగా నిర్వర్తించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. కమిషనరేట్ పరిధిలో హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్సైగా పదోన్నతి పొందిన రమేష్, కుమారస్వామి శుక్రవారం సీపీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. సీపీఆర్‌బీ ఏసీపీ డేవిడ్ రాజ్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆశపడి గెలిపిస్తే గోస పడుతున్న రైతులు

హన్మకొండ: న్యాయం జరుగుతుందని ఆశపడి కాంగ్రెస్‌కు ఓటేస్తే రైతులు గోసపడే పరిస్థితి వచ్చిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న యూరియా కొరత, మంత్రుల వ్యాఖ్యలపై వీడియో సందేశాన్ని ఆయన విడుదల చేశారు. యూరియా కోసం ఎరువుల దుకాణం వద్ద చెప్పులు వరుసలో పెట్టి పడిగాపులు కాయాల్సిన దుస్థితి దాపురించిందని ప్రభుత్వ తీరుపై ధ్వజమెత్తారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్ర స్వామి దేవాలయ ప్రాంగణంలోని లలితాదేవి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా లలితాదేవిని అలంకరించి పూజలు చేశారు.

శాకంబరీ మాతగా అన్నపూర్ణాదేవి

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో అన్నపూర్ణ మాతను కూరగాయలతో శుక్రవారం రాత్రి శాకంబరీ దేవిగా అలంకరించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు సమర్పించిన కూరగాయలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

మెడికవర్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో నగరానికి చెందిన 58 ఏళ్ల ప్రమీలకు అరుదైన లాపరోటమీ శస్త్ర చికిత్స నిర్వహించినట్లు వైద్యుడు సునీల్ తెలిపారు. తీవ్రమైన కడుపునొప్పి, మలంలో రక్తం రావడం, అధిక జ్వరం, సెప్సిస్‌తో ఇబ్బంది పడుతూ మెడికవర్ ఆస్పత్రిలో ఇటీవల ప్రమీల చేరినట్లు చెప్పారు. గ్యాస్ట్రో ఇంటెస్టినల్ విభాగంలోని వైద్యుల పర్యవేక్షణలో పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి లాపరోటమీ విజయవంతంగా నిర్వహించినట్లు వివరించారు.

బోడగుట్టలో సీపీఎం పాదయాత్ర

కాజీపేట: కాజీపేట 47వ డివిజన్ బోడగుట్ట కాలనీలో సీపీఎం కార్యకర్తలు శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. కాలనీలోని సమస్యలపై ప్రత్యేక నివేదిక తయారు చేయడం కోసం పార్టీ మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య ఆధ్వర్యంలో కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి క్షేత్రస్థాయి సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో జంపాల రమేష్, వేణు, రజియా, నందు, శైలజ, సర్వర్, రసూల్, రాజ్‌మహ్మద్, రామకృష్ణ, గడ్డం సతీష్ పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

హసన్‌పర్తి: సామాజిక సేవా కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు ముందుండాలని వాకర్స్ అసోసియేషన్ -303 డిప్యూటీ గవర్నర్ పావుశెట్టి శ్రీధర్ పిలుపునిచ్చారు. కిట్స్ వాకర్స్ అసోసియేషన్, నాగమళ్ల రోజా రమణి మెమోరియల్ సంయుక్త ఆధ్వర్యంలో అంబేడ్కర్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో వాటర్ బాటిళ్లను శుక్రవారం పంపిణీ చేశారు.

24, 25వ తేదీల్లో మెగా రక్తదాన శిబిరాలు

ఖిలా వరంగల్: విశ్వ బంధుత్వ దినోత్సవం సందర్భంగా శివనగర్‌లోని విశ్వశాంతి భవనంలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 24, 25వ తేదీల్లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు బ్రహ్మకుమారి శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

టీపీసీసీ ప్రధాన కార్యదర్శికి సన్మానం

హన్మకొండ: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ.శ్రీనివాస్ రావును బ్రహ్మకుమారీలు శుక్రవారం సన్మానించారు. హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని స్వగృహంలో ఆయనను బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు సుధాకర్, శశిధర్, వైష్ణవి, సరిత, నాగరాజు మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపిక అందించారు.

కోటలో మడేలయ్య బోనాలు

ఖిలా వరంగల్: రజకుల ఆరాధ్య దైవం మడేలయ్య పండుగను శుక్రవారం వైభవంగా జరుపుకున్నారు. శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా మధ్యకోటలో రజక కుల మహిళలు భక్తిశ్రద్ధలతో మడేలయ్యకు బోనం సమర్పించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ఖిలా వరంగల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ మరుపల్లి రవి సూచించారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా వరంగల్ 40వ డివిజన్‌లోని ఉప్పరోని కుంట, ముకుంద కాలనీ, మంకీ ఫుడ్ కోర్ట్ ప్రాంతాల్లో బల్దియా హెల్త్ అసిస్టెంట్ పెండ్యాల బాబు ఆధ్వర్యంలో నీరు నిల్వ ఉన్న చోట్ల శుక్రవారం ఆయిల్ బాల్స్‌వేశారు. పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ఇంటింటికి స్టిక్కరింగ్ చేస్తూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు.

గణపతి దీక్షల స్వీకరణ

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో 240 మంది శుక్రవారం గణపతి దీక్షలు స్వీకరించారు. భద్రకాళి దేవస్థాన ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో 11 రోజుల దీక్షలు తీసుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణశర్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సెప్టెంబర్ 6న ఇరుముడి ధారణతో పాటు దీక్షల విరమణ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవులపల్లి సదానందం, ఆలయ మేనేజర్ రవి, పీఆర్వో మణిదీప్ పర్యవేక్షించారు.



గణపతి దీక్షలు స్వీకరిస్తున్న భక్తులు

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్సీ సారయ్య

రామన్నపేట: పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. వరంగల్‌లోని తన నివాసంలో 26 మంది లబ్ధిదారులకు రూ.13 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం పొందిన పేదలకు సీఎంఆర్ఎఫ్ అండగా ఉంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండేటి నరేంద్రకుమార్, బస్వరాజు శిరీషశ్రీమాన్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కురివి పరమేశ్వర్, వరంగల్ తూర్పు యూత్‌కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ.సలీం, నాయకులు వరుణ్, లక్ష్మణ్, సంపత్, జన్ను రవి, రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.